జయజయ శంకర




హరహర శంకర

సంపుటి : 1 సంచిక : 11

శ్రీః

# కామకోటి వాణి

శ్రీ శోభకృత్ ఆషాఢ మాసం - జూలై 2023




శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము

# "పసితనంలో తల్లిదండ్రులు గురుతుల్యులు, తరువాత గురువు తల్లిదండ్రుల తుల్యుడు – ఇదీ భారతీయ పరంపర"

## సాక్షి టివి చానల్‌కు గురుపౌర్ణమి విశిష్టత గురించి స్వామివారి అనుగ్రహభాషణం





**సాక్షి టివి : నమస్కారం స్వామీ! మొదటిగా గురుపౌర్ణమి విశిష్టతను మీ మాటల్లో విందామని కోరుకుంటున్నాను.**

**స్వామివారు:** 'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ' – 'సత్యం వద ధర్మం చర' అంటూ కృష్ణ యజుర్వేదానికి చెందిన తైత్తిరీయ ఉపనిషత్తు మనకు ఉపదేశిస్తుంది. మాతృదేవోభవ – మొదటి గురువుగా మన భారతీయ సంస్కృతిలో గౌరవింపబడేది తల్లి. ఆ తల్లి ద్వారా మనకి భక్తి, సదాచారం, విద్య, ప్రేమ, స్నేహం, శ్రద్ధ, ఆధ్యాత్మిక ఉన్నతి, ఆత్మగుణాలు ఇవన్నీ కూడా కలుగుతాయి. ఫౌండేషన్ అంటాం కదా! అలా ఆధారశిల, ఆధారపీఠం తల్లి. మానవజీవితంలో అందరికి జ్ఞానప్రాప్తి అనేది తల్లి దగ్గర నుంచి వస్తుంది. పితృదేవోభవ – రెండవ గురువుగా మన జీవితంలో తండ్రి ఉంటారు. ఆయన

జ్ఞాన గురువుగా ఉపదేశం చేస్తారు. (అంటే పురాణంలో తండ్రికి ఉపదేశం కుమారస్వామి చేశారు అని ఉన్నా, సామాన్య జీవితంలో తండ్రి అమ్మాయికిగాని, అబ్బాయికిగాని హితోపదేశం చేస్తారు.) పరిరక్షకుడుగా ఉంటారు. మూడవది ఆచార్యదేవోభవ. సాందీపుని ఆశ్రమంలో కృష్ణపరమాత్మ ఆయనతో పాటు సుధామ (కుచేలుడు) అందరూ కలసి చదువుకున్నారు. వారి వారి ఆర్థికస్తోమత వేరుగా ఉన్నా గురుకుల విద్యలో అభిమానం, స్వాభిమానం రెండూ నేర్పించేవారు.

కృష్ణపరమాత్మ సుధామ చెప్పకుండానే ఆయన అవసరాన్ని గుర్తించి తన కటాక్షాన్ని ప్రసరింపజేశారు. 'గురు శుశ్రూషయా విద్యా పుష్కలేన ధనేన వా అథవా విద్యయా విద్యా తురీయా నోపలభ్యతే'. గురువుగారికి సేవ చేసి, శుశ్రూష చేసి వారితో ఉండి విద్యను నేర్చుకోవడం. జీవితంలో మంచి స్వభావంతో ఎలా జీవించాలో గురువుగారిని ఆదర్శంగా పెట్టుకుని జీవన విద్య (లైఫ్ స్టైల్) కూడా నేర్చుకోవడం.



**సాక్షి టివి : భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్ని నేర్పాల్సింది గురువా ? తల్లిదండ్రులా స్వామి ?**

**స్వామివారు :** ముందు తల్లి, తరవాత తండ్రి. తల్లి, తండ్రి ఇద్దరూ కలసి పిల్లలని గురుకులానికి తీసుకొనిపోయి గురువుగారి దగ్గర 'ఇది మా బాధ్యత' దాన్ని మీరు స్వీకరించి మార్గదర్శనం చేయాలని అప్పగిస్తారు. మొదట తల్లిదండ్రులు గురుతుల్యులు. తరవాత గురువు తల్లిదండ్రుల తుల్యుడు. ఇదీ భారతీయ పరంపర. గురువు అంటే ఎవరు ? అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ శంకరాచార్యులవారు 'కో గురుః ? అధిగత తత్త్వః శిష్యహితాయ ఉద్యతః సతతం' అని చెప్పారు. 'ఆచినోతి చ శాస్త్రార్థం ఆచారే స్థాపయత్యపి స్వయం ఆచరతే యశ్చ తమ్ ఆచార్యం ప్రచక్షతే' ఎవరైతే శాస్త్ర వివరాలు మనకు అందిస్తూ, ఆచరిస్తూ, ప్రజలలో ప్రచారం చేస్తున్నారో ఆయనే గురువు. బుద్ధి జీవికే నేను పాఠం చెబుతాను. సులభంగా ఉండేదే చెబుతాను అని కాదు. ఒక మనిషిని మంచివ్యక్తిగా తయారుచెయ్యడం. సద్బుద్ధి కలిగినవాడిగా తీర్చిదిద్దడం గురువు యొక్క కర్తవ్యం.

శిష్యహితాయ ఉద్యతః సతతమ్ – శిష్య ఉన్నతి కోసం ఎల్లప్పుడూ ప్రయత్నం చేసేవారే గురువు. అందుకని ఆయనకు ఓపిక, జ్ఞానం, ప్రేమ, దయ, వంటి గుణాలు ఉండాలి. అలాంటి గురువులు ఈ దేశాన్ని నడిపించారు. మనకి బలాన్ని, జ్ఞానాన్ని ప్రసాదించి, తోడుగా ఉంటున్నారు. కవచంగా ఉంటున్నారు. అలాంటి గురువులను పూజించే రోజు గురుపూర్ణిమ. సంస్కృతి, సభ్యత, సదాచారానికి ఆదర్శంగా, కేంద్రంగా, మూర్ధన్యంగా ఉండి దేశానికి ఎవరైతే జ్ఞాన ప్రదాతలో వారందరికీ సన్మానం చేస్తూ గౌరవిస్తూ పూజించే పండగ ఈ గురుపూర్ణిమ.

**సాక్షి టివి : పూర్ణిమ రోజునే మనం ఎందుకు గురువులను పూజిస్తాము స్వామి ?**

**స్వామివారు :** ఆషాడ శుక్ల పూర్ణిమ రోజును వ్యాస పూర్ణిమ అంటారు. మనం వినాయకచవితి, శ్రీరామనవమి, గోకులాష్టమి, వరలక్ష్మివ్రతం, వటసావిత్రీవ్రతం మొదలైనవి చేస్తూ దేవతలని, అవతార పురుషులని పూజిస్తూ ఉంటాము. అసలు భగవంతుడు అని మనకు నేర్పిన వారు గురువులు. గురువు చెప్పకపోతే మనకి శాస్త్రాలు, సాంప్రదాయాలు తెలియవు కదా ! అలాంటి మొదటి గురువుగా వ్యాసులవారు ఉన్నారు. వేదవ్యాసమహర్షి విష్ణుపురాణం, శివపురాణం, విష్ణు ధర్మోత్తర పురాణం, బ్రహ్మాండపురాణం, పద్మపురాణం మొదలైన మొదలైన 18 పురాణాలను మనకు సులభమైన సంస్కృత సాహిత్యంలో వ్రాసి అందించారు. అన్నదానం చేయండి, పుణ్యం వస్తుంది. చెట్లు

నాటితే అవి నీడను ఇస్తాయి. చలివేంద్రం పెట్టండి, దాహం తీరుతుంది. అజ్ఞానం తొలగించి విద్యాదానం ద్వారా జ్ఞానమనే దీపాన్ని వెలిగించండి. అంటూ దానం అనే ఒక గొప్ప విషయాన్ని మనకి తెలియచేశారు. 'ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోర్జున సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః' దేశంలో ఉండే వాళ్ళందరూ ఒక విధంగా చూస్తే యోగులు అనే చెప్పాలి. భారతదేశంలో యోగులు నుంచి పేదరికం అనుభవించేవారి దాకా అన్ని స్థాయిలవాళ్ళు ఇతరుల యొక్క సుఖాన్ని, దుఃఖాన్ని అర్థం చేసుకొని అసూయాద్వేషాలకు అతీతంగా వ్యవహరిస్తారు.

మనిషిని చూడగానే అంచనా వేయడం సబబు కాదు. మన దేశంలో ప్రజలందరూ ధర్మాన్ని, భగవంతుడిని నమ్ముతారు. ఇన్ని భాషలు, సంప్రదాయాలు, నమ్మకాలు, ఉన్నా సమైక్యతను మనం

చూస్తున్నామంటే సాంఘికంగా అండర్‌స్టాండింగ్ ఏదైతే ఉందో దానికి కారణం భక్తి, సదాచారం. పూర్వం యోగులు, మహర్షులు, భక్తి, సదాచారాన్ని ప్రతి గ్రామంలో, ప్రతి కుటుంబంలో ప్రచారం చేశారు. అలా 'అష్టాదశ పురాణేషు వ్యాసస్య వచనద్వయం పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం' అని పరోపకారం చెయ్యండి. అందరినీ పరమాత్మ స్వరూపంగా, మీలో ఒకరిగా చూడండి. ద్వేషం, విరోధం పనికిరాదని చెప్పి శాంతి క్షేత్రంగా చేసిన యశస్సు, కీర్తి వ్యాసమహర్షిది. అందుకని వ్యాసులవారి పూజని ఉద్దేశ్యంగా పెట్టుకొని గురుపూర్ణిమ పూజలు జరుగుతాయి. ఈ గురుపూర్ణిమ రోజు గురువు, పరమగురువు, పరమేష్ఠిగురువు, పరాత్పరగురువు వీరందరికీ పూజలు చేస్తారు. మన దేశాన్ని కాపాడుతున్న ఇంద్రాది అష్టదిక్పాలకులకి పూజలు చేస్తాము. వేద ప్రవక్తలు జైమిని, సుమంతు, పైల, వైశంపాయన, సనత్కుమార, సనత్సుజాత, సనాతన ఇలాంటి మహర్షులనేకులకి పూజ చేసి, శంకరాచార్యులు, తోటకాచార్యులు, హస్తామలకాచార్యులు, పద్మ పాదాచార్యులను పూజిస్తారు.

శంకరాచార్యులవారి భాష్యంలాగా వార్తికం అని ఒకటి ఉంటుంది. తైత్తిరీయ వార్తికం, బృహదారణ్యక వార్తికమని శ్లోకరూపంలో పెద్ద రామాయణంలాగ అనేక వేల శ్లోకాలతో వ్రాసి అందించిన





వారు సురేశ్వరాచార్యులు. సురేశ్వరాచార్యువవారికీ పూజ చేస్తారు. అందరికీ కేంద్రంగా వ్యాస భగవంతుడికి, ఇంకా ముందుగా కృష్ణ పరమాత్మకి ఆ రోజు పూజ చేస్తాం. కృష్ణం వందే జగద్గురుమ్ అంటాం కదా ! ఆయన భగవద్గీత ఉపదేశం చేసి మనందరికి జగద్గురువుగా ఉన్నారు. అందుకని కృష్ణ పరమాత్మకి 'శుద్ధ చైతన్యమూర్తి' అని పూజలు చేస్తాం. మహర్షులు పూజించే జగద్గురువు అయిన కృష్ణ పరమాత్మను పూజించే మంచిరోజు గురుపూర్ణిమ. చాతుర్మాస్యకాలంలో అది వస్తుంది. అందరూ కూడా జ్ఞానపరమైన సేవలు చేస్తూ గురువు ఆశీర్వచనం పొందాలి. 'గు శబ్దస్తు అంధకారస్స్యాత్ రు శబ్దః తన్నివర్తకః' గు అంటే చీకటి, రు అంటే దానిని తొలగించేవారు. మానవ జీవితంలో ఉండే అజ్ఞానం, అశ్రద్ధ, అహంకారం, చీకటిని తొలగించి, సాత్వికమైన, శ్రద్ధాపూర్వకమైన భక్తి, శ్రద్ధల్ని మనకు కలిగించే గురువుకి వందనం చేసుకోవాలి. గురుపూర్ణిమ రోజు మహానుభావుల్ని తలుచుకుంటూ స్వజీవితంలో మంచి నేర్పిన తల్లిదండ్రులు, గురువులు ఎవరుంటారో వారందరినీ కూడా స్మరణం చేస్తూ, గౌరవిస్తూ ఆశీర్వచనం పొందాలి.

**సాక్షి టివి : స్వామి ! కామక్రోధ మదమాత్సర్యాలని చెప్పారు. వాటన్నింటినీ మన భరతఖండం అదుపులో ఉంచుకుంటుంది. దేశంలో కల్లోలాలు, గొడవలు, వర్గాల మధ్య గొడవలు రావడానికి కారణము ఏమిటి ?**

**స్వామివారు :** ప్రజల మధ్య గొడవలు రావడం ఎక్కడైనా సహజం. ప్రేరేపణల వల్ల ఎక్కువ అవుతాయి. సహజంగా భారతదేశం శాంతిక్షేత్రం. అందరూ ధర్మాన్ని, భగవంతుడిని నమ్ముకున్నవారే. వారి, పూర్వజన్మ, రాబోయే జన్మ గురించి అందరికీ ఒక అవగాహన ఉంటుంది. 'పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనం' అనే ఒక విశ్వాసం ఉండే దేశం భారతదేశం. అందుకని స్వతః వీరందరూ కూడా శాంతి, ప్రేమను కలిగి ఉంటారు. సరైనమార్గం లేక కష్టం మరీ ఎక్కువైతే, నమ్మకం తగ్గిపోతే అలా అసంతృప్తి వస్తుంది.

పిల్లలకు మనం మంచి సంస్కారం, సమయం ఇవ్వాలి. చదువు కోసం ఏర్పాటు చేస్తున్నాం కాని సమయం ఇవ్వడం లేదు. పిల్లలకి సంపదతో పాటు సమయం ఇచ్చి, ప్రక్కన ఉండి వారిని సన్మార్గంలో నడిపించాలి. అప్పుడు అశాంతి, అల్లకల్లోలాలన్ని తగ్గుతాయి. ప్రశాంతత వస్తుంది.

**సాక్షి టివి : ప్రకృతిని మనం ఆస్వాదిస్తున్నాం, ఆరాధిస్తున్నాం. కాని అదే ప్రకృతిని మనం ఈ రోజున నాశనం చేసే ప్రయత్నం**

చేస్తున్నాము. ఎందుకని జరుగుతోంది స్వామి?

**స్వామివారు :** ఐకమత్యం లేదు కనుక! లోకంలో అందరూ వాళ్ళిష్టప్రకారం చేసి ఎదుటివారు సరిగ్గా చెయ్యలేదంటారు. మనం సరిగ్గానే చేస్తున్నాం. భారతదేశంలో ఇంత జనాభా, ఎన్నో భాషలు, ఎన్నో సమాజాలు ఉన్నాయి. ఈ మధ్యలో మనకు రీసోర్సెస్ తక్కువ. కాని మనం మంచిగానే చేస్తున్నాము ప్రపంచ దేశాలు భారతానికి సహకరించాలి. అప్పుడు ప్రపంచానికి భారతం సహకరిస్తుంది. భారతదేశానికి సహకరించ వలసిన సమయము ఇది. ఏ నమ్మకానికి చెందినవారయినా అందరూ కలసి ఆచరించవలసిన లోకధర్మాలు కొన్ని ఉన్నాయి. ఆ లోక ధర్మాల్లో ఫ్యామిలీ సిస్టమ్, పెద్దవాళ్ళని గౌరవించడం, మన ప్రజలందరికి సొంతమైన సామాజిక ఆస్తులకు ఇబ్బంది కలిగించకుండా ఉండడం పాటించాలి. సేవా కార్యక్రమాలు, మంచిమాటలు చెప్పడం లాంటివన్నీ అందరూ చేయవలసిన ధర్మాలు. 'స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్' అని చెప్పినట్లుగా మనం చేసే ధర్మం చిన్నదిగా ఉన్నా పెద్ద ఆపదల నుంచి, కష్టం నుంచి మనల్ని కాపాడుతుంది. అహంభావం పెరిగింది. కాని సేవభావం పెరగాలి. సేవాతత్పరత అనేది మనుషుల్లో రావాలి. ఆరోజుల్లో ఆత్మార్పణ స్తుతి అని అప్పయ్య దీక్షితులు వ్రాశారు. ఆత్మస్తుతి నుంచి ఆత్మార్పణ స్తుతికి మనం వెళ్ళాలి. ఆత్మస్తుతి, పరనింద అనేది యిప్పుడు నడుస్తోంది. సకారాత్మక ఆలోచనలు మన దేశంలో పెరిగితే ఇపుడు మీరు ప్రశ్నిస్తున్న ఈ అల్లరి ఉండదు. దేశం భద్రంగా ఉంటుంది.

**సాక్షి టివి :** కంచి పరమాచార్యులు ఆ రోజున విద్య, వైద్యరంగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ వచ్చి తదనుగుణంగానే ఎన్నో సంస్థలు స్థాపింపచేశారు. వారికి ఆ రోజున ఆ ఆలోచన




ఎందుకు వచ్చింది స్వామి ?

**స్వామివారు :** వారు అనేక కష్టాలు, సంఘర్షణలు చూశారు. ఆయన 1907వ సంవత్సరం పీఠానికి వచ్చారు. 1917లో మన ఆసియాలో రాజకీయ, సామాజిక పరిస్థితుల్లో పెద్ద మార్పు వచ్చింది. అంటే ఋషిభూమిగా ఉన్న ప్రదేశం వేరొక రకంగా మారింది. మూలభూతమైన ఋషి ప్రదేశమునే ఇప్పటి రష్యా అంటారు. 1940లో ప్రక్కన దేశమైన చైనాలో కూడా మార్పు వచ్చింది. ఇలా ప్రపంచంలో చాలా మార్పుల్ని ఆయన చూశారు. కనీసం మూల ధర్మాన్ని కాపాడాలి అని సేవాభావం, సమైక్యత దేశంలో ఉండాలి అని తాపత్రయపడ్డారు. పేదరిక నిర్మూలనం చెయ్యాలి అనుకున్నారు. 'లక్ష్మీం చ దేహి మమ ధర్మసమృద్ధిహేతుం' లక్ష్మీ కృపను పొందాలని ప్రయత్నించారు. 'సంపత్కరాణి సకలేంద్రియ నందనాని' అన్నట్టుగా కనకధారా స్తుతి యొక్క భావార్థాన్ని వారు తెలుసుకొని ఆ రోజుల్లో అనేక సేవా కార్యక్రమాలు మొదలు పెట్టారు. భక్తి, ముక్తి, రెండింటిలో మంచిగా ఉండాలని కర్మ, జ్ఞాన, భక్తిని ప్రబోధం చేశారు. దాని పరిణామం ఇన్ని వేద పాఠశాలల్లో మనం చూస్తున్నాము. ఇన్ని ధర్మసేవలను కూడా మనం చూస్తున్నాము. అందుకని మనిషి మనసులో మార్పురావాలి, ఆత్మవిశ్వాసం ఉండాలి. సమాజంపరంగా పరస్పర విశ్వాసం ఉండాలి. (Understanding, Co-operation ఉండాలి) అన్నింటికన్నా ముందు మనకి ఈశ్వరునిపై విశ్వాసం ఉండాలి. దాని కోసం మహాస్వామివారు కృషి చేసారు.

**సాక్షి టివి :** ప్రాచీన, ఆధునిక, విజ్ఞానాన్ని సమన్వయ పరుస్తూ కంచి పరమాచార్యులవారు రీసెర్చ్ చేస్తూ వచ్చారు అన్నారు. అది నేటి సమాజానికి ఏ రకంగా ఉపయోగపడబోతోంది స్వామి ?

**స్వామివారు :** నేటి సమాజానికే ఎక్కువ ఉపయోగం ఉన్నది. ఆ రోజుల్లో నమ్మకమే ప్రధానంగా ఉండేది. ఈరోజు knowledge కావాలి. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరికీ నేనే తెలుసుకోవాలి, కన్విన్స్ అవ్వాలి, స్వీకరించాలి, అప్పుడే నేను దీనిని ఆచరిస్తాననే తత్వం ఉన్నది. అందుకని ఆ వైజ్ఞానికం మరియు జ్ఞాన విజ్ఞాన – సహయోగ – సమన్వయ – సమర్థనా పద్ధతి రెండూ కలవాలి. ఆర్ష విజ్ఞానం, ఆధునిక విజ్ఞానం రెంటినీ కలిపి మనం విద్యావిధానంలో మార్పు తీసుకొని వస్తే మనదేశంలో రోజువారి ఉపాధులు దొరుకుతాయి. ఉపాసన మంచిగా జరిగితే అందరికీ ఉపకారం జరుగుతుంది. నూతనమైన మంచివాటిని గౌరవించే దేశం భారతదేశం. 'న చాపి కావ్యం నవమిత్య వద్యం' కొత్త విషయాలను దూరం పెట్టే దేశం మనది కాదని ఆ రోజుల్లో కాళిదాస కవి చెప్పారు. మంచిదైతే కొత్తదైనా,



ఎక్కడినుంచి వచ్చినా దానిని మనం గౌరవిస్తాము, కలుపుకుంటాము. అలా నూతన విజ్ఞానం పాశ్చాత్యదేశం నుంచి వచ్చినా మన ప్రాచీన భారతదేశంలో ఉన్న ఆయుర్వేదం, జ్యోతిష్యం, వాస్తు, అంతరిక్షం, అలంకారం, భరతనాట్యం, శిల్పం, ఇలా 64 కళలను కలుపుకుంటే సుభిక్షం, భద్రత, వికాసం ఇవన్నీ మంచిగా అందరికీ కలుగుతాయి. అందరికీ మంచి జరగడానికి భగవంతుడిని ప్రార్థన చేద్దాము. *



# శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి విజయయాత్రా విశేషాలు




**02/06/23 (శుక్రవారము) :** పూజ్యశ్రీ శంకరాచార్య స్వామి వారు బెంగళూరులో నివసిస్తున్న కాశ్మీరు పండితులను ఉద్దేశించి తమ అనుగ్రహభాషణంలో మాట్లాడుతూ వారి అవసరాలని చర్చించారు. తరచుగా వారి వారి స్వస్థలాలకు వెళుతూ వారి ఉనికిని కాపాడుకోవాలని స్వామివారు సూచించారు.




**03/06/23 (శనివారము - అనూష పౌర్ణమి) :** పూజ్యశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామివారి 130వ జయంతి సందర్భంగా పూజ్యశ్రీ విజయేంద్రసరస్వతి స్వామివారు ఆ రోజు ఉదయం జరిగిన అర్చన, సమిష్టి గాయత్రి జపం చేసిన బ్రహ్మచారులను ఆశీర్వదించారు. పిమ్మట అధిక సంఖ్యలో వున్న భక్తులకు తమ ఆశీస్సులు, ప్రసాదాలతో అనుగ్రహించారు.







**04/06/23 (ఆదివారము) :**
పూజ్యశ్రీ స్వామివారు నాగర్తపేట, బెంగుళూరులోని శ్రీ నాగరేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. భక్తులకు ప్రసాదాలు అనుగ్రహభాషణంతో అనుగ్రహించారు. మల్లేశ్వరం సమీపంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని స్వామివారు దర్శించారు. అక్కడి నుండీ మల్లేశ్వరంలోని శ్రీ కంచి కామకోటి శంకరమఠం వరకు దారికి ఇరువైపులా జన సందోహంతో జయ జయ ధ్వానాలతో స్వామివారికి ఘన స్వాగతం భక్తులు పలికారు. అలౌకిక ఆనందంతో భక్తులు వివిధ పుష్పమాలలను స్వామి వారికి సమర్పించారు. వారినందరిని స్వామివారు ఆశీర్వదించారు.

**05/06/23 (సోమవారము) :**
గత 3 రోజులుగా హెూమంతో పాటు సామవేద పారాయణ గావించిన వేదపండితులని, సామవేద సమ్మేళన సభలో పాల్గొన్న వారి కుటుంబ సభ్యులను అనుగ్రహభాషణంతో పాటు ఆశీస్సులు ప్రసాదాలు స్వామివారు అందచేశారు. ఆ వేదపండితులను సత్కరించారు.






**06/06/23 (మంగళవారము) :** మార్తహళ్ళి లోని శంకర కంటి హాస్పిటల్‌ను స్వామివారు సందర్శించారు. ఆస్పత్రి ఆవరణలోని శ్రీ వి.వెంకటరెడ్డిగారి విభాగాన్ని ప్రారంభించారు. ఆస్పత్రి ఆవరణంతా నడయాడి అందరినీ ఆశీర్వదించారు.




**08/06/23 (గురువారము సాయంకాలము) :** తీర్థ ప్రసాదాలు, అనుగ్రహ భాషణం అనంతరం పూజ్యశ్రీ శంకరాచార్య స్వామివారు విజయయాత్రలో భాగంగా సాయంత్రం అనంతపూర్ బయల్దేరారు. మార్గమధ్యంలో పెనుకొండ గ్రామంలో స్వామివారిని పూర్ణకుంభంతో స్వాగతించారు. అనుగ్రహ భాషణంతో స్వామివారు వారిని అనుగ్రహించారు.





**09/06/23 (శుక్రవారము ఉదయం) :** కర్నూలుకు వెళ్ళే మార్గమధ్యంలో దూపాడులో వున్న గోరక్షణశాలను పూజ్యశ్రీ శంకరాచార్య స్వామివారు దర్శించారు. అక్కడి గుమిగూడిన భక్తులకు అనుగ్రహభాషణంతో పాటు ప్రసాదాలను అందించారు. ఆ పిదప కర్నూలులో వున్నశ్రీ శంకరమందిరానికి చేరుకున్నారు.






**10/6/23 (ఆదివారము) :** పూజ్యశ్రీ శంకరాచార్యులవారు కర్నూల్‌లో త్రికాల పూజలు ముగించుకుని భక్తులందరిని తీర్థ ప్రసాదాలతో ఆశీర్వదించి అనుగ్రహభాషణం పిదప దుండిగల్‌కు బయల్దేరారు. స్వామివారు దారి మధ్యలో వేచివున్న సంప్రదాయ పాఠశాల, మహబూబ్‌నగర్ విద్యార్థులను కలిసి ఆశీర్వదించారు. శ్రీ మహావిద్యాపీఠం, దుండిగల్ చేరుకున్న స్వామివారు అక్కడ కొత్తగా నిర్మించిన 'శ్రీ కంచి కామకోటి సర్వహిత మండపాన్ని' ప్రారంభించారు. అనుగ్రహభాషణంతో అందరినీ ఆశీర్వదించారు.







**10/6/23 (ఆదివారము) :** వర్గల్ వీధులలో భక్తులందరూ అత్యంత ఉత్సాంహంతో రోడ్డుకిరువైపులా నిలబడి దారిపొడుగునా పూలజల్లు కురిపిస్తూ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారిని ఘనంగా స్వాగతించారు. శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం వద్ద వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తదుపరి స్వామివారు 'శ్రీ కంచి కామకోటి శంకర మఠ' నూతన భవనాన్ని ప్రారంభించారు. భక్తులందరినీ ఆశీర్వదించారు.






**12/06/23 (సోమవారము) :** శ్రీ శంకరాచార్యులవారు ఉదయమే శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారికి అభిషేకము గావించారు. సాయంత్రము శ్రీ లక్ష్మీనరసింహ అనుగ్రహ ట్రస్ట్ అవార్డు ట్రస్ట్ 2023కు చెందిన పండితులను ఆశీర్వదించారు.




**13/06/23 (మంగళవారం) :** వర్గల్‌లో త్రికాల పూజ, చండీ హోమ పూర్ణాహుతి పిదప భక్తులందరినీ ఆశీర్వదించి స్వామివారు నిజామాబాద్‌కు బయల్దేరారు. మధ్యలో కామారెడ్డి వద్ద స్వామివారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. నిజామాబాద్ లో భక్తులు బారులుతీరి ఘనస్వాగతం పలికారు.





**14-06-23 (బుధవారం):** పూజ్యశ్రీ స్వామివారు నిజామాబాద్‌లో శ్రీ సార్వజనిక్ గణేష్ మందిర్ సందర్శించారు మరియు నాలుగు ప్రధాన పదబంధాలను వివరిస్తూ అనుగ్రహ భాషణంతో భక్తులను అనుగ్రహించారు. 'అక్రోధేన జయేత్ క్రోధమ్ అసాధు సాధునా జయేత్ । జయేత్ కదర్యం దానేన, జయేత్ సత్యేన చానృతం' అంటే కోపం, చెడు, లోభత్వం, అసత్యాలను ప్రశాంతతతో, మంచి ప్రవర్తనతో, దానగుణంతో, సత్యస్వభావంతో జయించండి. నేటి నిర్దేశిత పుస్తకాల నుండి నేర్చుకోవడం కంటే మన పురాణాలు మరియు కావ్యాల నుండి భారతీయ చరిత్ర మరియు హిందూ సంస్కృతిని మరింత బాగా అర్థం చేసుకోవచ్చని స్వామివారు తెలియపరిచారు.





**17-06-23 :** పూజ్యశ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారికి నిర్మల్ పట్టణ ప్రజానీకం పూర్ణకుంభ స్వాగతం పలికారు. నిర్మల్ బ్రాహ్మణ సేవా సంఘం, కల్యాణ మండపం, శివాలయాలు దర్శించి అనుగ్రహభాషణం, ప్రసాదాలతో భక్తులందరినీ ఆశీర్వదించారు. 25 సంవత్సరాల కిందట పీఠంతో పాటుగా శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి వారితో తాముకూడా ఈ స్థలానికి విచ్చేసి పూజలు చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. త్రికాల పూజలు తీర్థప్రసాదాల అనంతరం 18వ తేదీ సాయంకాలం ఆదిలాబాద్ బయల్దేరారు.





**18-06-23 :** పూజ్యశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారిని వినాయక్ చౌక్, ఆదిలాబాద్, వద్ద 18వ తేదీ సాయంత్రం పురప్రజలు ఘనస్వాగతంతో సగౌరవంగా ఆహ్వానించారు. తదనంతరం రాంమందిర్, తిరుపల్లి (బస) చేరుకొని భక్తులందరినీ ఆశీర్వదించి అనుగ్రహభాషణం చేశారు.

**19-06-23** నాడు రెండు కాలాల పూజ, తీర్థ ప్రసాదాల అనంతరం, పూజ్యశ్రీ స్వామివారు శ్రీ రామచంద్ర గోపాల్ కృష్ణ మఠాన్ని సందర్శించారు. అక్కడకు వచ్చిన భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేసి ఆశీర్వదించారు. స్వామివారు తిరిగి మఠానికి వచ్చిన పిదప దీపపూజ చేస్తున్న భక్తులను ఆశీర్వదించారు. అనుగ్రహ భాషణం అనంతరం వైదికులను, స్థానిక పురోహితులను సన్మానించారు



**20-06-23** నాడు త్రికాల పూజ ముగించుకుని అక్కడే జరుగుతున్న చండీహోమ పూర్ణాహుతిని తిలకించి భక్తులను ఆశీర్వదించి తదుపరి నాగపూర్‌కు బయల్దేరారు.






**20-06-23 :** రంగురంగుల కాషాయ పతాకాలతో, త్రికోణ హిందూ జెండాలతో భక్తజనసందోహం పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారిని భక్తితో వినయంతో 20వ సాయంకాలం నాగపూర్ పట్టణానికి ఘనస్వాగతం పలికారు. శ్రీ భగవత్ పాద సభ, రాంనగర్‌లో బస ఏర్పాటు జరిగింది. అక్కడ గుమిగూడిన భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేసి ఆశీర్వదించారు. 20 సంవత్సరాల కిందట అదే స్థలంలో శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి పూజ చేశామని ధర్మోద్ధరణకై పాటుపడాలని చెప్పామని గుర్తు చేశారు. 21వ తేదీనాడు రెండు కాలాల పూజ ముగించిన పిదప భక్తులందరికీ తీర్థప్రసాదాలను ఇచ్చారు. సాయంకాలం సభ్యులకు కార్యాచరణకు అవసరమైన సూచనలు చేసి మూడోకాలం పూజ ముగించారు. మరుసటి రోజు 22వ తేదీ మూడు కాలాల పూజ పూర్తి చేసుకొని భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందించి దగ్గర్లో వున్న సర్వేశ్వర దేవాలయాన్ని దర్శించారు. ఆ పిమ్మట రాంటెక్ పట్టణానికి బయల్దేరారు.





**22-06-23 :** రాంటెక్‌లో పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారు మౌదా రోడ్, Kavikulguru Institute of technology & Scienceలో బస చేశారు. ఆ సంస్థ విద్యార్థులు, భక్తులు స్వామివారిని ఆనందోత్సాహాలతో పూల జల్లులతో ఘనంగా ఆహ్వానించారు. 23వ తేదీ శుక్రవారం నాడు స్వామివారు రెండు కాలాల పూజ ఉదయాన్నే ముగించి సాయంకాలం దీప పూజ చేస్తున్న భక్తులను ఆశీర్వదించి మూడో కాలం పూజ ముగించారు. మరుసటి రోజు పూజలు దర్శనాల పిదప సాయంకాలం శ్రీ శంకర విద్యాలయ స్వచ్ఛంద సేవకులను ఆశీర్వదించారు.. తమ మునుపటి యాత్రను గుర్తు చేసుకున్నారు. 25వ తేదీ సూర్య గ్రహణంతో సమానమైన భానుసప్తమి నాడు సౌర పురాణ పఠనం గావించిన ఋగ్వేద పండితులను ఆశీర్వదించారు. త్రికాల పూజ అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ చేసి పిదప మధ్యాహ్నం జబల్పూర్ బయలుదేరారు.










**25-06-23 :** జబల్పూర్ వెళ్ళే మార్గమధ్యంలో పూజ్యశ్రీ శంకరాచార్య శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారు శ్రీ భగవాన్ కథ మండపం, సిమరియా, సియోని, దర్శించారు. శ్రీ మహామండలేశ్వర్ స్వామి ప్రజ్ఞానంద సరస్వతి మహారాజ్‌గారిని కలిసి అక్కడి భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. శ్రీమహారాజ్‌గారు శ్రీకంచికామకోటిపీఠంతో తమకున్న అనుబంధం, గౌరవం వినమ్రతతో వివరించారు. ఆయన గతంలో తాము శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి వారిని కలిసినప్పటి సందర్భాలను భక్తిపూర్వకంగా తెలిపారు. అదే రోజు శ్రీ శంకరాచార్య స్వామివారు పురప్రజల ఘన స్వాగతంతో జబల్పూర్‌లోని ఘోరా నక్కస్‌రోడ్‌లోని శ్రీ నర్సింగ్ మందిరానికి చేరారు. మరుసటి తోజు యథావిధిగా త్రికాల పూజ, భక్తులకు దర్శనం. ఆ సాయంకాలం గ్వారిఘాట్ వద్ద వున్న భక్తిధాం సందర్శించి అనుగ్రహభాషణం ఇచ్చారు. 27వ తేదీ త్రికాల పూజ పిదప నర్మదా నది ఒడ్డున ఉన్న గ్వారిఘాట్‌కు వెళ్లి నదీమాతకు శాస్త్ర ప్రకారం పూజలు గావించి వైదికులకి దానాదులు, భక్తులందరికీ ఆశీస్సులు ఇచ్చారు. అక్కడినుండి రేవా కు బయల్దేరారు.










**28-06-23 :** పూజ్యశ్రీ శంకరాచార్య స్వామి వారు త్రికాల పూజలు, తీర్థ ప్రసాదాలు, అనుగ్రహ భాషణం ముగించిన పిదప ప్రయాగరాజ్ కు బయలుదేరారు. మధ్యప్రదేశ్ సరిహద్దు దాటగానే అడుగడుగునా తండోప తండాలుగా భక్తులు, పుర వాసులు, గ్రామస్థులు, పూల మాలలతో వాద్యాలతో స్వామివారి దర్శనంకోసం, ఆశీస్సుల కోసం తహతహ లాడారు. నారీభారీ, గన్న, ఝరికటి, గురుపూర్, మామాభాంజా బజార్, దండిభల్, లెప్రసీ మిషన్ చౌరాహ్, నిర్మాన్ కండ్ రోడ్ (ఆది శంకరాచార్య విగ్రహం వున్న చోటు)లలో భక్తసమూహాలు స్వామివారికి స్వాగతం పలికారు. శ్రీ వేణి మాధవ మందిర్, శ్రీ సిద్దేశ్వర మహాదేవ మందిర్ లను స్వామివారు దర్శించి అక్కడున్న భక్తులకు ప్రసాదాలు ఆశీస్సులు అందించారు. ఆ పిదప ప్రయాగరాజ్ చేరుకుని శ్రీ కంచి కామకోటి విమాన మండపంలో బస చేశారు.





**3-7-23** తేదీ నాడు పరమ పవిత్రమైన ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద వ్యాసపూజ అత్యంత విశేషంగా భక్తి శ్రద్ధలతో జరిగింది. పూజ్య శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారు త్రివేణి సంగమం ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పండల్ వద్ద వ్యాసపూజ నిర్వహించారు. పూజ ఉదయం 10:30 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు ముగిసింది. భక్తులు సమష్టి భిక్షావందనం చేశారు. పూజానంతరం భక్తులకు వ్యాసాక్షతలు అనుగ్రహించి స్వామివారు ఆదిశంకర విమాన మండపానికి చేరుకున్నారు.

## వ్యాసపూజ - మండలం - శ్రీ కంచి మఠం

### వ్యాసపూజ మండలం - ఒక ప్రత్యేక విశిష్ఠ సంప్రదాయం.

సమస్త దేవతలను, దేవ ఋషి గణాలను 46 నిమ్మకాయలపై ఆహ్వానించి శాస్త్రానుసారం పూజలు చేయడం.
ఆహ్వానింపబడు విధానం :

**1. కృష్ణ పంచకం :** శ్రీకృష్ణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ మరియు సంకర్షణ (5 నిమ్మకాయలు)
**2. వ్యాస పంచకం :** శ్రీవ్యాస, పైల, వైశంపాయన, జైమిని మరియు సుమంతు (5 నిమ్మ కాయలు)
**3. భగవత్పాద పంచకం :** శ్రీశంకర భగవత్పాద, పద్మపాదాచార్య, సురేశ్వరాచార్య, హస్తామలకాచార్య మరియు తోటకాచార్య. (5 నిమ్మకాయలు)
**4. సనక పంచకం:** శ్రీ శంకర, సనందన, సనాతన, సనత్ కుమార మరియు సనత్సుజాత (5 నిమ్మకాయలు)
**5. ద్రవిడ పంచకం :** శ్రీ ద్రవిడాచార్య గౌడపాదాచార్య, గోవింద భగవత్పాదాచార్య, సంక్షేపకాచార్య మరియు వివరణాచార్య (5 నిమ్మకాయలు)
**6. గురు పంచకం :** సన్యాసాశ్రమంలో వున్న సన్యాసి యొక్క గురు, పరమ గురు, పరమేష్ఠి గురు, పరాపర గురు మరియు సంప్రదాయ మార్గం అనుసరిస్తున్న ప్రతినిధులు (అన్యే బ్రహ్మవిద్యా సంప్రదాయ కర్తారః గుర్వాహ) (5 నిమ్మకాయలు)
పైన పేర్కొన్న గురువులకే కాకుండా, పూజలను శ్రీశుక్ర, నారద. దుర్గ, గణపతి, క్షేత్రపాలకులు, సరస్వతి మరియు దశ దిక్పాలకులకు కూడా పూజలను చేస్తారు. (ఇంద్ర, అగ్ని, యమ, నిరుతి, వరుణ, వాయు, సోముడు, ఈశాన్యుడు, బ్రహ్మ, శేష) మొదలగు దేవగణాలకు ... (16 నిమ్మకాయలు)
ఈ విధంగా 46 నిమ్మకాయలలో ఆవాహనం జరుగుతుంది.
శుద్ధ చైతన్య దివ్యత్వాన్ని అక్కడి సాలిగ్రామంలో ఆవాహన చేయడంతో పూజ కార్యక్రమం ముగుస్తుంది.
సామూహిక పునః పూజ, విసర్జనం చిట్టచివరన జరుపుతారు.







**5-7-23** నాడు ఉదయం స్వామివారు ప్రయాగలో త్రివేణీ సంగమ స్నానం ఆచరించి, సంగమ ప్రాంతంలో విశేష పూజలు నిర్వహించి, అనంతరం శ్రీ వేణుమాధవ స్వామి దర్శనం చేసుకున్నారు.


**5-7-23** తేదీ సాయంత్రానికి శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారు కాశీ చేరుకున్నారు. రామన్ విలాస్ వద్ద కాశీపట్టణ మేయర్ నేతృత్వంలో కాశీ పురప్రజలు భక్తి శ్రద్ధలతో స్వామివారికి ఘనంగా స్వాగతం పలికారు. శ్రీజయేంద్ర సరస్వతీ స్వామివారి చిత్రపటాన్ని రథంపై పూలమాలలతో అలంకరించి శ్రీ స్వామివారితో పాటు కాశీలోని ప్రధాన వీధులో 5 గంటలపాటు ఊరేంగింపు చేశారు. తదనంతరం కాశీ మహారాజు మరియు యువరాజు శ్రీ స్వామివారికి పాదపూజ చేసుకున్నారు.








**6-7-23** నాడు వారణాసిలోని శ్రీ కాశీ విశ్వనాథుని ఆలయంలో శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారు షోడశోపచార పూజలు నిర్వహించారు. శ్రీ స్వామివారికి ఆలయం ప్రధాన ద్వారం వద్ద నగర కమీషనర్‌తో సహా ఆలయ పండిట్లు, ట్రస్టీలు పూర్ణకుంభంతో వేదమంత్రాలతో స్వాగతం పలికారు. స్వామివారు గర్భాలయంలో పంచామృతములతో విశ్వనాథుడికి అభిషేకం చేసి పట్టువస్త్రాలు, స్వర్ణపుష్పం, రజిత చామరం సమర్పించారు. అనంతరం ముక్తి మండపాన్ని సందర్శించి హనుమాన్ ఘాట్‌లోని శంకర్ మఠానికి చేరుకున్నారు.





శ్రీ జయేంద్రసరస్వతీ స్వామివారు, శ్రీ విజయేంద్రసరస్వతీ స్వామివారు 1988వ సంవత్సరంలో కాశీయాత్ర చేసినప్పుడు బాలస్వామివారు విశ్వనాథునికి అభిషేకం చేస్తున్నప్పటి దృశ్యం. (పైన చిత్రంలో తిలకించవచ్చు)

# విశాఖ శ్రీ శంకరమఠం సంగ్రహ చరిత్ర




ఆదిశంకరులు బదరీ నుండి కైలాసమునకు యోగ మార్గము ద్వారా వెళ్ళి శ్రీ పార్వతీ పరమేశ్వరులను దర్శించి, పరమేశ్వరుడు ప్రసాదించిన పంచలింగములను (యోగ, భోగ, వర, ముక్తి, మోక్షములనెడి) తీసుకునివచ్చి దేశం నాలుగుదిక్కులా నాలుగు పీఠములు స్థాపించి, కంచి యందు స్వయంగా సర్వజ్ఞ పీఠాన్ని అధిరోహించారు.

లోకగురువులైన శ్రీ శంకరులు అమ్మవారిని స్తుతించిన సౌందర్యలహరీ స్తోత్రము కైలాసము నుండి ప్రసాదించినదే. కైలాసయాత్ర నుండి మరలివచ్చిన శ్రీశంకరులు దిగ్విజయ యాత్ర ముగించి యోగలింగముతో కాంచీపురము చేరి శ్రీకామాక్షి అమ్మవారిని సేవించి సర్వజ్ఞపీఠం అధిరోహించిరి. అనతి కాలములోనే తన 32వ ఏట శ్రీశంకరులు కాంచీ క్షేత్రమునందు ముక్తి పొందిరి. శ్రీ శంకరుల సన్నిధి శ్రీ కామాక్షీ ఆలయ రెండవ ప్రాకారంలో ఇప్పటికీ కలదు.

అట్టి సర్వజ్ఞపీఠమైన శ్రీ కంచి కామకోటి పీఠమును శ్రీ ఆదిశంకరుల నుండి పరంపరగా ఇప్పటికి 70మంది ఆచార్యులు అధిరోహించి భారతదేశములో సనాతన వైదిక ధర్మమును ప్రబోధిస్తూ శ్రీ శంకర అద్వైత తత్వాన్ని ప్రచారం చేస్తున్నారు.

ఆ ఆచార్య పరంపరలో తపోబల సంపన్నులు, సర్వజ్ఞులు సాక్షాత్తు శ్రీశంకరులే అని భక్తుల నమ్మికను పొందిన పరమాచార్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు. అపర శంకరుల వలె కాలినడకను సాగిన వారి భారతదేశ జైత్రయాత్రలో విశాఖకు ఇతఃపూర్వం రెండు పర్యాయములు విజయం చేసినారు.

1965వ సంవత్సరం డిసెంబర్‌లో తర్కవేదాంత సార్వభౌమ కామకోటి పీఠ ఆస్థాన పండితులు శ్రీ మండలీక వెంకటశాస్త్రిగారు విశాఖపట్టణమున ద్వారకానగర్‌లో బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శ్రీ విజయ రాఘవన్ ఇంటి ప్రాంగణంలో ప్రాజ్ఞుల సమక్షంలో భాగవత ప్రసంగములు చేశారు. ఆ సందర్భంగా శ్రీ శాస్త్రిగారు అన్ని విధముల అభివృద్ధి చెందుతున్న విశాఖలో శ్రీ కంచి కామకోటి పీఠ అనుబంధంగా ఒక శంకరమఠం నిర్మాణం జరగవలెనని సూచించిరి.

ఈ సమావేశములోనే శ్రీ శంకరమఠ నిర్మాణమునకు పూజ్యులు, త్యాగధనులు శ్రీ తెన్నేటి విశ్వనాథంగారి అధ్యక్షతన, ఇదే ఆలోచనతో ఉండి కొంత కృషి సల్పిన వదాన్యులు శ్రీ బెండపూడి పేరాజుగారు - ఉపాధ్యక్షులుగా 18మంది కార్యవర్గమును ఎన్నుకొనిన తర్వాత రిజిష్టరు చేయబడినది (1966).

స్థలసేకరణ నిమిత్తం ద్వారకానగర్లో ప్రసూతికేంద్రము కోసం నిర్దేశింపబడిన 1500 గజముల స్థలమును కార్యవర్గము పరిశీలించి

శ్రీ శంకరమఠ నిర్మాణమునకు అనువుగా నుండునని భావించిరి. పూజ్యులు శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు ద్వారకానగర్ సహకార గృహనిర్మాణ సంస్థ అప్పటి అధ్యక్షులు శ్రీ యర్రపోలు కృష్ణారావుగారితో యీ ప్రతిపాదన చేసిరి. శ్రీ కృష్ణారావుగారు వెంటనే ఆ స్థలమును సొసైటీ అనుమతితో శ్రీ శంకరమఠ నిర్మాణమునకై ఏర్పడ్డ కార్యవర్గమునకు ధారాదత్తం చేసిరి. తర్వాత రిజిష్టరు కూడా చేయబడినది.

తర్వాత శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు విశాఖపట్టణ ప్రజల తరఫున ఒక వినతి పత్రమును శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారికి పంపుతూ శ్రీ స్వామివారు సమీప భవిష్యత్తులో వారు జరపదలచిన ఆంధ్రదేశ జైత్రయాత్రలో విశాఖ విచ్చేసి శ్రీ కామకోటి శ్రీ శంకరమఠమును స్థాపించి భగవత్పాదుల పాదుకలను అనుగ్రహించవల్సినదిగా వేడుకొనిరి. శ్రీవారు తమ అంగీకారమును తెలియజేసిరి.

1969వ సంవత్సరములో శ్రీవారు ఆంధ్రదేశ జైత్రయాత్ర కొనసాగిస్తూ విశాఖ వచ్చినప్పుడు అప్పటి జిల్లా కలెక్టర్ మాన్యులు శ్రీ పి. ఎల్. శివరాంగారు అధికారికంగా జిల్లా పొలిమేరలో పాయకరావు పేట సమీపమున శ్రీవారికి స్వాగతాంగజలి సమర్పించి విశాఖకు తీసుకువచ్చిరి. విశాఖపట్టణ ఆహ్వాన సంఘాధ్యక్షులు శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు ఆసీలుమెట్ట సమీపమున శ్రీవారిని పూర్ణకుంభం స్వాగతం పలికి శ్రీస్వామివారి  పర్యటనలోనే ద్వారకానగర్లో శ్రీ శంకరమఠ నిర్మాణమునకు అనుగ్రహించవలసినదిగా అర్థించిరి. శ్రీస్వామివారు దశఫలా మైదానంలో బసచేసి అమ్మవారి పూజలొనర్చి అనుగ్రహభాషణం చేస్తూ భక్తులను అనుగ్రహిస్తూ ఆశీస్సులందజేసే వారు. శ్రీ జయేంద్ర సరస్వతీ స్వామివారు కూడా వారితో విచ్చేయడం జరిగింది. కీలకనామ సంవత్సర మాఘ శుద్ధ త్రయోదశీ రాత్రి సమయమున శ్రీవారు కాలినడకన ద్వారకానగర్లో శ్రీ శంకరమఠ నిర్మాణమునకు నిర్దేశించిన స్థలమును దర్శించి అచటనే మూడు రాత్రిళ్ళు వరుసగా పరుండి పావనం చేశారు.

మాఘ పూర్ణిమనాడు అశేష భక్తజన సందోహంలో 'హరహర శంకర కాంచి శంకర హర్ష ద్వానముల మధ్య వారి పవిత్ర హస్తములతో శ్రీ ఆదిశంకరుల పాదద్వయమున ప్రతిష్టించి అనుగ్రహించిరి. ఆ సభలో తెన్నేటి విశ్వనాథంగారు, మండలీక వెంకటశాస్త్రిగారు, జిల్లా కలెక్టర్ పి. ఎల్ శివరాంగారు, శ్రీబెండపూడి పేర్రాజుగారు, కార్యదర్శి శ్రీ ఆకెళ్ళ అచ్యుతరామం తదితర కార్యవర్గ సభ్యులు నగర ప్రముఖులు, అధికారులు సమావేశమైరి. అపుడే శ్రీవారు అనుగ్రహభాషణం చేస్తూ శ్రీ శంకరమఠ స్థాపనతో విశాఖ సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతుందని నగరానికి ఇది కేంద్రం అవుతుందని ఆశీస్సులు అందించిరి. అప్పటికి గర్భాలయం సిమెంటు రేకుల ఆచ్ఛాదనలో ఉండేది. కార్యవర్గంవారు సుమారు రూ. 50,000లు విరాళ రూపములో సముపార్జించిరి. 1970లో జిల్లా కలెక్టర్ శ్రీ పి. ఎల్. శివరాంగారు శ్రీ శంకరమఠ నిర్మాణ నిమిత్తం మరికొన్ని నిధులు సేకరణ కొరకు శ్రీస్వామివారి భక్తురాలు సుప్రసిద్ధ సంగీత విదుషీమణి శ్రీమతి ఎమ్. ఎస్. సుబ్బలక్ష్మిగారి సంగీతసభ మునిసిపల్ మైదానంలో ఏర్పాటుచేసి రూ. 60,000/- పోగుచేసిరి. ఈ మొత్తం డబ్బుతో త్వరగా గర్భగుడి, ఇప్పటి ప్రధాన ఆలయం విశాలమైన ముఖ మండపంతో నిర్మించబడింది.

ప్రధాన అర్చకులుగా శ్రీ కె. రామశాస్త్రిగారు విశేష సమయ ములలో ప్రత్యేక అర్చకులుగా శ్రీ వి. యస్. శ్రీనివాస శాస్త్రి అయ్యర్ గారు నియమింపబడిరి. భక్తి శ్రద్ధలతో పూజాకార్యక్రమములు నిర్వహిస్తూ వారు అనతికాలంలోనే భక్తులను ఆకట్టుకొని వారి మన్ననలను పొందిరి. అవంతిహోమం, దక్షిణామూర్తిహోమం, నవగ్రహహోమం ఆయా వారములలో జరిపిస్తూ విశేషంగా వసంత నవరాత్రులు, శ్రీ శంకరజయంతి, గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రులు వైభవంగా జరుగుతుండేవి. క్రమక్రమంగా శ్రీ శంకరమఠం అభివృద్ధి చెందుతూ శ్రీ సరస్వతి, గౌరి, కుమారస్వామి, సత్యనారాయణ మూర్తి, లక్ష్మీదేవి, వినాయకుల సన్నిధులతో వెలుగొందుతూ భక్తుల మనోభీష్టములను నెరవేరుస్తూ ఆధ్యాత్మిక కేంద్రంగా శ్రీస్వామివారి ఆశీస్సుల ఫలితంగా ప్రసిద్ధి పొందింది. 1973లో శ్రీ చల్లపల్లి రామారావుగారు వారి ధర్మపత్ని శ్రీమతి కనకదుర్గగార్లు నవగ్రహ ప్రతిష్ట చేసి మండప నిర్మాణం చేసిరి.

శ్రీ వి. యస్. రావుగారు (వఝుల శ్రీనివాసరావుగారు డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఎస్. ఇ. రాజమండ్రి) వారి కార్యదర్శకత్వంలో ప్రధాన ఆలయమునకు కుడివైపున ఆస్ బెస్టాస్ రేకులతో సువిశాలమైన హాల్ నిర్మించి శ్రీ మండలీక వెంకటశాస్త్రి మండపం నామకరణం చేయించి ప్రవచన హాల్‌గా ప్రారంభించిరి. శ్రీశాస్త్రిగారి చిత్రపటం మండపము నందు అలంకరించిరి.

1975లో శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతీ స్వాములవారు విశాఖ పట్టణం వేంచేసి శ్రీ శంకరమఠంలోనే బసచేసి 11రోజులు అతిరుద్ర మహాయాగం వైభవంగా జరిపించిరి. అప్పుడే ఆచార్య దివాకర్ల రామమూర్తిగారిని ముద్రణాధికారిగా నియమిస్తూ శ్రీముఖమును జారీచేసిరి.

కాశీపండితులు శ్రీ ధర్మాల సుబ్బరాయ శాస్త్రిగారు ప్రధాన పండితులుగా నియమించబడి భారత, భాగవత, శ్రీ శంకర ప్రకరణ గ్రంథములను, వివేకచూడామణి ప్రవచనములను భక్తుల హృదయములను హత్తుకొను విధంగా చెప్పుండేవారు. శ్రీ వాజపేయయాజుల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, తర్కసామ్రాట్ శ్రీ కొల్లూరు సోమశేఖరశాస్త్రిగారు, శ్రీ కల్లూరి వీరభద్రశాస్త్రిగారు, శ్రీ రేమెళ్ళ సూర్యప్రకాశశాస్త్రిగారు విశేషంగా ప్రవచనములు చేస్తూండెడివారు.

యలమంచలి వాస్తవ్యులు శ్రీ శిష్టా బుచ్చిశాస్త్రిగారి ఆధ్వర్యములో శ్రీ కపిలవాయి అగ్నిహోత్రశాస్త్రిగార్ల పర్యవేక్షణలో అనేకములైన క్రతువులు, యాగములు జరిగినవి. మహాన్యాసపూర్వక రుద్రాభిషేకములు, లక్షపత్రిపూజ, మహాలింగార్చన, సహస్ర లింగార్చన మున్నగు విశేషపూజలు జరిపించెడివారు. మాఘ మాసములో సూర్యనమస్కారములు భక్తుల గోత్రనామములతో నిర్వహించెడివారు. శ్రీ సేతుమాధవన్, శ్రీ విజయరాఘవన్, శ్రీ సుబ్రహ్మణ్యన్, శ్రీ కృష్ణన్, శ్రీ జయరామన్ మొదలగు అరవ సోదరులు శ్రీ శంకరమఠంలో శ్రీరామ నవరాత్రులు, శ్రీ సుబ్రహ్మణ్య షష్టి, శ్రావణ పూర్ణిమనాడు సామూహిక ఉపాకర్మ వైభవంగా నిర్వహించెడివారు.

1975వ సంవత్సరం పండితశర్మ శ్రీ రాంభట్ల లక్ష్మీనారాయణ శాస్త్రిగారు ప్రతిరోజూ సాయం సమయమున రామాయణ, భారత, భాగవత, దేవీభాగవత ప్రవచనములు నాలుగు సంవత్సరములు జరిపి భక్తుల విశేష ఆదరణ పొందిరి.

1979లో శ్రీ శంకరమఠ చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది. శ్రీ శంకరమఠ ఆశయములు మేరకు ఒక చక్కని వేదపాఠశాల శ్రీ భమిడిపాటి నరసావధానులుగారి ఆధ్వర్యంలో సుమారు 15-20మంది విద్యార్థులతో ప్రారంభమైనది. వారు ఉదయం సాయంకాలంలలో ప్రతిరోజూ రుద్ర అధ్యాయ శ్రీ సూక్త పురుషసూక్తములు గురుముఖతః భక్తి శ్రద్ధలతో సుస్వరంతో నేర్చుకొనిరి. బాలబాలికలు 80మంది ప్రతిరోజూ ఉచిత సంస్కృత భాషాబోధనలో చేరి ఒక సంవత్సరం శిక్షణ పొంది ప్రావీణ్యం సంపాదించిరి.

టిటిడివారి ఆర్థిక సహాయంతో పాఠశాల నిర్వహించబడినది. టిటిడి ధర్మప్రచారపరిషత్ నిర్వాహకులు శ్రీ సీతారామయ్యగారు వారి కార్యక్రమములు కూడ శ్రీ శంకరమఠంలోనే జరిపిస్తూ భక్తుల ఆదరాభిమానములు చూరగొన్నారు.

సంవత్సరంలో ప్రతిరోజు ఉదయం గం.5.30ని. లకే భక్తులతో కిటకిటలాడుతూ ప్రవచనం హాల్ వెలుగొందుతూ మహాపండితులు విజయవాడ నుండి మద్దులపల్లి మాణిక్యశాస్త్రిగారు, రాజమండ్రి నుండి పేరి సూర్యనారాయణశాస్త్రిగారు, వరంగల్ నుండి శ్రీ మల్లా సుబ్బరామశాస్త్రిగారు, హైదరాబాద్ నుండి శ్రీ సన్నిధానం లక్ష్మీనారాయణశాస్త్రిగారు, శ్రీ యోగినీమాతగారు, పౌరాణిక సార్వభౌమ మల్లాది చంద్రశేఖరశాస్త్రిగారు, వఝల బందరు నుండి శ్రీ మల్లాప్రగడ శ్రీరంగారావుగారు, శ్రీ రేమెళ్ళ సూర్య ప్రకాశశాస్త్రిగార్ల ప్రవచనములతో అలరారుతుండెడిది.

సాయంసమయమున సుప్రసిద్ధ హరికథకులు శ్రీ కోట సచ్చిదానందశాస్త్రి, శ్రీ బుర్రా శివరామకృష్ణ శర్మ, శ్రీ మునుకుట్ల సదాశివశాస్త్రి, శ్రీ అమ్ముల విశ్వనాథం, శ్రీ అక్కిపెద్ది శ్రీరామశర్మ, టిటిడి హరికథకులు వంగట పట్టాభి మున్నగు వారెందరో వారి కథాగానంతో భక్తులను మంత్రముగ్ధులను చేసిరి.

సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు శ్రీ యం.యస్. బాలసుబ్రహ్మణ్య శర్మ, శ్రీ షేక్ మదీనా, మైసూరు ఆస్థాన విద్వాంసులు, వైణికులు శ్రీ ఆర్.కె. సూర్యనారాయణగారు మున్నగువారు వారి సంగీత వైదుష్యాన్ని ప్రదర్శించి సన్మానింపబడిరి. 1980లో బ్రహ్మచారి సుందరచైతన్య (ప్రస్తుతం శ్రీ సుందరచైతన్యానంద స్వాములు) అధ్యాత్మిక ప్రవచనములు, విశాఖ పండితులచే భువనవిజయం నాటక ప్రదర్శన విశేష జన సందోహం యొక్క ప్రశంసలు అందుకొన్నాయి.

మొట్టమొదటిసారిగా 1979లో గోదావరి జిల్లాల వేదపండితులతో బాటు కృష్ణా, గుంటూరు జిల్లాల వేదపండితులు ముఖ్యంగా దెందుకూరివారు, విష్ణుభట్లవారిని ఆహ్వానించి ఘనంగా వేదసభలు నిర్వహించి పండితులను సన్మానించడమైనది.

వాణిజ్యపన్నుల అధికారిగా పనిచేసి పేరుమోసిన శ్రీ ఈరంకి సుబ్బారావుగారు 1980లో కార్యదర్శిగా పదవీ బాధ్యతలు చేపట్టి నిర్విరామంగా 17 సంవత్సరములు అకుంఠిత దీక్షతో తన జీవితాంతము వరకు శ్రమించి శ్రీ శంకరమఠ సర్వతోముఖాభివృద్ధికి విశేషమైన కృషి సల్పిరి. వారి నిరుపమానమైన సేవలు విశాఖ ప్రజలు నిరంతరము జ్ఞప్తికి ఉంచుకొందురుగాక.

1982లో శ్రీ సుబ్బారావుగారు ఆస్‌బెస్టాస్ రేకులతో నిర్మాణమైన ప్రవచనహాల్ స్థానంలో సర్వాంగ సుందరమైన కళ్యాణ మండపమును కట్టు నిమిత్తం శ్రీ వి.ఆర్. గుప్తాగారి ధనసహాయంతో పని ప్రారంభించి తర్వాత శ్రీ డి.వి. సుబ్బారావుగారి సలహామేరకు శ్రీ టి. సుబ్బిరామిరెడ్డిగారిని అర్థించి వారి ధనసహాయంతో వారి పేరున రెండు అంతస్థుల కళ్యాణ మండపం అన్ని హంగులతో విశాఖ వాసులకు ప్రసాదించిరి. దానిని అప్పటి గవర్నర్ కుముద్‌బెన్ జోషీగారు ప్రారంభించిరి. తరవాత శ్రీ ఈరంకి సుబ్బారావుగారి సలహామేరకు

శ్రీ కొప్పు చిరంజీవిగారు వారి తాతగారైన కొప్పు గుర్రన్న స్మారకంగా మరొక అంతస్థును నిర్మించి వారి జీవితం చిన్న వయస్సులోనే చరితార్థం చేసుకున్నారు. ఈ కళ్యాణ మండప నిర్మాణంవల్ల శ్రీ శంకరమఠం ఆదాయం గణనీయంగా పెరిగింది.

శ్రీ ఈరంకి సుబ్బారావుగారు వైదికాచార సంపన్నులు. వారు ప్రతిసంవత్సరం శ్రీ శంకర జయంతికి దేశంలో సుప్రసిద్ధులైన వేదపండితులకు, శాస్త్ర పండితులకు, శ్రీ శంకరమఠ ఆధ్వర్యంలో సువర్ణ కంకణములు, సింహతలాటములతో ఘనంగా సన్మానిస్తూ ఉండెడివారు. అట్టివారిలో ప్రముఖులు శ్రీ గోడా సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, శ్రీ విష్ణుభట్ల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, శ్రీ లంక వెంకట్రామ సోమయాజిగారు, శ్రీ దెందుకూరి వెంకటప్ప యజ్ఞనారాయణయాజులు గారు, శ్రీపాద శ్రీరామఘనపాఠిగారు. వేదపాఠశాల నిమిత్తం. ఒక చక్కని భవనం ఆలయం ఎడమవైపుగా నిర్మించబడినది. పీఠాధిపతులు, స్వాముల వారి సిబ్బందికి వసతి నిమిత్తం ఆలయం ఇరుప్రక్కల, వెనుకగా భవనములు నిర్మించబడినవి. అర్చకులకు వారి కుటుంబములతో ఉండుటకు అనువైన వసతి కల్పించబడినది.

శ్రీ కంచి కామకోటి పీఠం శంకరమఠంలో మాదిరిగా ఇచట కూడా ఒక రమణీయమైన 3 అంతస్థుల ముఖద్వారం ముగ్గురు స్వాముల విగ్రహములతో నిర్మించబడి శ్రీ శంకరమఠమునకు ఔన్నత్యమును ప్రసాదించినది. వేదపాఠశాల నిర్వహణ, వేదసభలు ప్రతిసంవత్సరం జరిపించి, పరీక్షలు నిర్వహించి, అర్హత పొందిన వేద విద్యార్థులకు ఉపకారవేతనములు, పట్టాలు ఇచ్చుటకు తగిన నిబంధనలతో చక్కటి వ్యవస్థ ఏర్పాటు చేయడమైనది.

1996లో శ్రీ శంకరమఠ ప్రధాన గోపురమున బంగారు కలశాల స్థాపన శ్రీశ్రీశ్రీ జనార్ధనానంద సరస్వతీ స్వాములవారి



స్వహస్తములతో జరపబడి శ్రీ శంకరమఠమునకు నూతన శోభను, వన్నెను చేకూర్చినవి.

శ్రీశ్రీశ్రీ జనార్ధనానంద సరస్వతీ స్వాములవారు 1982 నుండి విశాఖ వచ్చినప్పుడు శ్రీ శంకరమఠంలో బసచేసి శ్రీ శంకరమఠ నిర్వహణలోనూ, వేదపాఠశాల, వేదసభల నిర్వహణలోనూ వారి అమూల్యమైన, అమోఘమైన సలహాలను, ఆశీస్సులను సంపూర్ణంగా కార్యవర్గమునకు అందజేస్తూ ప్రోత్సహించటం ద్వారా శ్రీశంకరమఠ వైభవానికి, భక్త జన ఉజ్జీవమునకు కారణభూతులైనారని అనుటలో సందేహం లేదు.

శ్రీ జయేంద్ర సరస్వతీ స్వామివారు కార్యవర్గం ప్రార్థనను అంగీకరించి రెండు పర్యాయములు శ్రీ శంకరమఠంలోనే చాతుర్మాస్య వ్రతమును సలిపి ప్రతినెలా ప్రదోష పూజ వైభవంగా తన స్వహస్తము లతో సలిపి పరమాచార్యులను, భక్తులకు జ్ఞప్తికి తెస్తున్నారనడంలో అతిశయోక్తి ఇసుమంతైనా లేదు. శ్రీస్వామివారు వేంచేసియున్న సమయంలో భక్తులకు, జిజ్ఞాసువులకు గాయత్రిమంత్ర మహిమ సంధ్యోపాసనలో రహస్యములను ప్రబోధిస్తూ వుండటం విశాఖ చేసుకొన్న అదృష్టంగా భావించాలి.

1998లో శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతీ స్వామివారు, శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు విశాఖ విచ్చేసి శ్రీ శంకరమఠంలో 4రోజులు బసచేసి భక్తులకు ఆశీఃపూర్వక అనుగ్రహ భాషణములు అందించిరి.

శ్రీ శంకరమఠం యొక్క అభివృద్ధిని పరికించి శ్రీవార్లు సంతసించి శ్రీకందాళ శ్రీనివాసరావుగార్ని, (శంకరమఠం అధ్యక్షులు) శ్రీ పుష్ప వరాహ నరసింహమూర్తిని, (కార్యదర్శి) శ్రీ సుసర్ల సూర్యనారాయణ మూర్తి (సంయుక్త కార్యదర్శి) ఇతర కార్యవర్గ సభ్యులను అభినందించి ఆశీస్సులు అందజేసిరి.


శ్రీవార్లు విశాఖలోనున్న వివిధ దేవాలయములు, ధార్మిక సంస్థలు, భక్తుల గృహములు దర్శించి పావనం చేసిరి. చివరి రోజున శ్రీవార్లకు శ్రీ కృష్ణ విద్యామందిర్ మైదానంలో పౌరసన్మానం ఘనంగా జరిగినది. సంస్కృతంలో, ఆంధ్రలోను సన్మానపత్రములు ఒసంగబడినవి. విశాఖ పురప్రజల తరపున మేయర్ శ్రీ సబ్బంహరిగారు వారి కార్పోరేటర్లతో సహా శ్రీ స్వామివార్లను ఘనంగా సన్మానించిరి. ఈ సభలో శ్రీ మేయర్ గారు, శ్రీ దూర్వాసుల వెంకట సుబ్బారావుగారు, శ్రీ టి. సుబ్బిరామిరెడ్డిగారు, ఎం.పి., జిల్లా ఉన్నతాధికార్లు శ్రీ వి. కృష్ణప్రసాద్ గారు, శ్రీ వి. సీతారామయ్యగారు(బ్రహ్మయ్య అండ్ కో) శ్రీ కె. చిరంజీవి గార్లు పాలుపంచుకొని విజయవంతం చేశారు.

1999లో మొట్టమొదటిసారిగా 30సం॥ చరిత్రలో శ్రీ కుప్పా రామావధానులుగారి ఆధ్వర్యంలో శ్రీ శంకరమఠ మహాసంప్రోక్షణ కార్యక్రమం వైభవంగా జరిగి శ్రీ శంకరమఠం నూతన పుష్టిని సంతరించుకొన్నది.

పరమాచార్యులవారి దివ్యాశీస్సులతో ప్రారంభించబడి ఈవిధంగా శ్రీ శంకరమఠం విశాఖ ఆస్తికుల హృదయాలలో చెరగని ముద్ర వేసుకొని భక్తకోటి ఐహిక, ఆముష్మిక ఫలప్రదాతగా ఎనలేని ఖ్యాతి నార్జించిదనడంలో యెట్టి సందేహం లేదు.

శ్రీ శంకరమఠ సర్వతోముఖాభివృద్ధికి విరివిగా విరాళములు ఇచ్చిన శ్రీ టి. సుబ్బిరామి రెడ్డిగారికి, శ్రీ కె.వి. చిరంజీవిగారికి, శ్రీ వి. ఆర్. గుప్తాగారికి కృతజ్ఞతలు తెలియజేసు కుంటున్నాము.

ఈ బృహత్కార్యంలో మొదటి నుండి విశేష కృషి సల్పిన తెన్నేటి విశ్వనాథంగారు, శ్రీ మండలీక వెంకటశాస్త్రిగారు, శ్రీ బెండిపూడి పేర్రాజుగారు, శ్రీ పి.ఎల్. శివరాంగారు, శ్రీ అచ్యుత రామంగారు, శ్రీనివాసరావుగారు, శ్రీ మధిర సుబ్బారావుగారు, శ్రీ చల్లపల్లి రామారావుగారు, శ్రీ రాయప్రోలు రామారావుగారు, శ్రీ జయంతి శ్రీరామమూర్తిగారు, శ్రీ సుసర్ల వెంకట సూర్యనారాయణగారు, రఘునాథరావుగారు, శ్రీ గంటి నరసింహమూర్తి గారు, శ్రీ సి. హెచ్. సన్యాసిరాజు గారు, శ్రీ మంథా సోమయ్యగారు, శ్రీ వి.యం. శర్మగారు, శ్రీ జె. అప్పారావుగారు, డి. భాస్కరమూర్తిగారు. యనమండ్ర భైరవశాస్త్రి గారు ముఖ్యంగా శ్రీ ఈరంకి సుబ్బారావుగారు, అరవ సోదరులు విజయ రాఘవన్‌గారు, సేతు మాధవన్‌గారు, సుబ్రహ్మణ్యమ్ గారు చిరస్మరణీయులు.



**అడ్రస్ :**
**శ్రీ శంకరమఠం, ద్వారకానగర్,**
**విశాఖపట్నం - 530016**
**ఆంధ్రప్రదేశ్**



శ్రీ ఎ. కుప్పుస్వామిగారు ఆంగ్లంలో రచించిన 'SHANKARACHARYA and His connection with kanchipuram' అనే ఎనిమిది అధ్యాయాల పుస్తకం నుండి తెలుగు అనువాదం క్రిందటి సంచిక తరవాతి భాగం...

# కాంచీపురంతో శ్రీశంకరాచార్యుల అనుబంధం

## కంచిలో శంకరాచార్యులవారు

ఇప్పటికే మనం గమనించినట్లుగా శంకరాచార్యుల జీవిత కథను అందించిన జీవిత చరిత్రల వివరాలు ఏకరీతిగా కనిపించవు. తన దిగ్విజయ యాత్రల సందర్భంగా ఆచార్యులు సందర్శించిన ప్రదేశాలకు సంబంధించి జీవిత చరిత్రలలో ఇచ్చిన ప్రదేశాల క్రమాలు ఒకదానికొకటి భిన్నంగా ఉం టాయి. కానీ జీవిత చరిత్ర రేఖాచిత్రం మాత్రమే కాకుండా, కొన్ని ఇతర రచనలు కూడా శంకరులు కంచిలో బస చేసిన సంఘటనలకు సంబంధించిన యాదృచ్ఛిక సూచనలు ఉన్నాయి. కానీ, బస చేసిన సమయంలో జరిగిన సంటనలకు సంబంధించిన వర్ణనల్లో వైరుధ్యాలు కనిపిస్తాయి. అయితే, కంచికి ఆచార్యుల రాక, నగరంలో బస చేయడం, దానికి సంబంధించిన ఘటనలకు సంబంధించి ప్రతి జీవిత గ్రంథం, ఇతర రచనలలో ఉన్న సమాచారాన్ని అధ్యయనం చేయడం ఉపయోగకరంగా, ఆసక్తికరంగా ఉంటుంది.

### శంకరులవారు కంచికి రావడం :

జీవిత చరిత్రలలో మాధవుడు రచించినట్టుగా చెప్తున్న గ్రంథం మాత్రమే పవిత్ర నగరంలో శంకరుల బస గురించి స్వల్ప వివరాలను అందిస్తుంది. తన గ్రంథంలోని 15వ ఆశ్వాసంలోని నాలుగవ శ్లోకంలో, రామేశ్వరంలో శ్రీ రామనాథుని ఆరాధించిన అనంతరం శంకరుల వారు కంచి చేరుకున్నట్టు వివరిస్తుంది:-

శ్లో ॥ అభిపూజ్య స తత్ర రామనాథం సహ పాండ్యైః స్వవశే విధాయ చోలాన్ ।
ద్రవిడాంశ్చ తతో జగామ కాంచీమ్ నగరీం హస్తిగిరేర్నితంబకాంచీమ్ ॥

ఈ శ్లోకం నాలుగవ పాదంపై దిండిమ వ్యాఖ్యానం ఈ విధంగా ఉంది –

శ్లో ॥ తతో హస్తిసంజ్ఞస్య పర్వతస్య కటిమేఖలాభూతాం కాంచీమ్ నగరీం జగామ.

దీన్ని బట్టి శంకరుడు (వరదరాజ స్వామి ఆలయం ఉన్న రాయి/ రాతి గుట్ట) గల హస్తగిరి అనే శిల నడుము చుట్టూ ఉన్నట్టుగా ఉన్న కంచి నగరానికి చేరుకున్నారని అర్థం చేసుకోవచ్చు.

అయితే, తుంగభద్ర లోయ నుంచి బయలుదేరిన తర్వాత శంకరులు శ్రీ వరదరాజుల రాజధాని అయిన కంచికి చేరుకున్నారని చిద్విలాసుని శంకర విజయం చెప్తుంది :–

**కాంచీమ్ వరదరాజస్య రాజధానీం అవాప సః**

ఈ పాదం ఆచార్యులు మొదటగా విష్ణు కంచికి చేరుకుని ఉండవచ్చని సూచిస్తుంది. ఇక, కంచికి శంకరుల వారి రాకకు సంబంధించి అనంతానందగిరి రచన ఈ విధంగా ఉంది:–

శ్లో ॥ తస్మాదాహోబిలాఖ్యం నృసింహావిర్భూతిస్థలం ప్రాప్య తత్ర నృసింహం స్తుత్వా
తస్మాద్ వేంకటేశమఖిలకారణం శుద్ధాద్వైతరూపం నత్వా... తస్మాత్ కాంచీనగరం ప్రావిశత్

అహోబిలంలో శ్రీ నృసింహుని, తిరుపతి కొండపైన శ్రీ వేంకటేశ్వరుడిని ఆరాధించిన అనంతరం శ్రీ శంకరులు కంచి నగర ప్రవేశం చేశారని పై ప్రకరణం పేర్కొంటోంది. గోవిందనాథుని శంకరాచార్య చరిత్రం ఇలా చెబుతోంది–

శ్లో ॥ గంగాతోయాభిషిక్తం చ రామనాథం ననామ సః ।
తతః కాంచీపురం గత్వా సర్వజ్ఞో యతిపుంగవః ॥

(రామేశ్వరంలోని శ్రీ రామనాథుని గంగాజలంతో అభిషేకించి, పూజించి, రామనాథునికి సాష్టాంగ ప్రణామం చేసిన అనంతరం, సర్వజ్ఞుడైన ఆ తపస్వి (శంకరులు) కంచికి చేరుకున్నారు.

శంకరులు అరుణాచలక్షేత్రం (తమిళనాడులోని తిరువణ్ణామలై) నుంచి కంచికి చేరుకున్నట్టు రాజచూడమణి దీక్షిత విరచిత శంకరాభ్యుదయం చెప్తుంది. కావ్యంలోని ఏడవ ఆశ్వాసంలోని 45వ శ్లోకం, ఆచార్యులు సత్యవ్రత క్షేత్రం అంటే, కాంచీపురం (విష్ణు కంచి) చేరుకున్నారని పేర్కొంటుంది. నలభై ఐదవ శ్లోకం తర్వాత వచ్చే నాలుగు శ్లోకాలూ, హస్తగిరిలోని పుణ్యకోటీశ్వర ఆలయాన్ని శంకరులు సందర్శించి శ్రీ వరదరాజులను, మహాదేవిని ఆరాధించినట్టు వర్ణిస్తున్నాయి.

డాక్టర్ షుల్జ్ ప్రచురించిన (Search for Sanskrit Manuscripts in South India )లో తుంగభద్ర ప్రాంతానికి చెందిన 'భారతి క్రమం' గురువుల జాబితా ప్రకారం, తుంగభద్ర తీరంలో దీర్ఘకాలం ఉన్న శంకరులు తన కోరిక ప్రకారమే తన పర్యటనలను ముగించుకుని, చివరిలో కంచికి వచ్చారని చెబుతుంది. ఈ సమాచారాన్ని కర్ణాటక ప్రాంతంలోని తుంగ, భద్ర నదుల సంగమంలో గల (శంకర పీఠాల గురువుల పరంపర జాబితా) గిరిపరంపర – నామమాలలోని ఒక శ్లోకం ఖరారు చేస్తుంది. సంప్రదాయం ప్రకారం ఆచార్యులు కంచిలో ప్రవేశించి, స్వల్పకాలంపాటు సర్వతీర్థం కొలను ఒడ్డున గల 'ముక్తిమంటపం'లో బస చేశారు.

## కంచి నగర పునర్నిర్మాణం :

శంకరులు శివ కంచిని చేరుకుని, శ్రీ ఏక్రామనాథుని, దేవి కామాక్షిని పూజించిన అనంతరం నగరాన్ని. మూడు ముఖ్య ఆలయాలు అయిన శ్రీ ఏకామ్రనాథ, వరదరాజ, దేవి కామాక్షి ఆలయాలను పునర్నిర్మించాలని యోచించారు.

శంకరాచార్యులవారి ఆదేశంతో కంచి రాజైన రాజసేనుడు కంచి నగరాన్ని, పునర్నిర్మాణం, ఆలయాల నిర్మాణాలు చేయడానికి సంబంధించిన వృత్తాంతాన్ని చిద్విలాసుడు వివరణాత్మకంగా పేర్కొన్నారు. శంకరుని కోరికకు అనుగుణంగా రాజసేన మహారాజు ఎంత త్వరితగతంగా స్పందించి చర్య తీసుకున్నదీ, ఆచార్యులకు అత్యంత సంతృప్తిని కలిగించే విధంగా నగరం నూతనంగా, అందంగా తయారైందో

25వ ఆశ్వాసంలో దిగువన పేర్కొన్న శ్లోకాలు వివరిస్తాయి.

**శ్లో ॥ శిరసైవ విధృత్యామ్ స రాజా హర్షసంయుతః ।**
**యథోక్తామ్ కారయామాస పురీం లక్షణ లక్షితాం ॥**

**శ్లో ॥ దేవాలయత్రయం తత్ర పృథగేవ వినిర్మమే ।**
**శివకాంచీతి తత్రైకాం ఏకామ్రేశకృతాశ్రయాం ॥**

**శ్లో ॥ నామ్నా తత్రైవ కామాక్ష్యాః పార్శ్వే ప్రాసాదముత్తమం ।**
**విష్ణుకాంచీతి నామ్నాన్యాం తోరణాదిపరిష్కృతాం ॥**
శ్రీ మద్వరదరాజస్య సౌధమన్యత్ సముజ్జ్వలం ch.25-28,29,30&31

అనంతానందగిరి రచించిన శంకరవిజయంలోని కాంచీ నగర నిర్మాణం శీర్షికతో దిగువన పేర్కొన్న 63వ ప్రకరణం, కంచి పునర్నిర్మాణం జరగడం గురించి, ఏకామ్రనాథ, వరదరాజ ఆలయాల ప్రతిష్ఠాపన, రెండు ఆలయాలలో పూజా ఏర్పాట్ల గురించి వివరిస్తుంది.

**తత్ర కిల భగవాన్ మహాదేవః** స్వకీయ పృథివీమూర్త్యావిర్భూత లింగరూపేణ ఏకామ్రేశ ఇతి ప్రసిద్ధో వర్తతే. తస్మిన్ స్థలే మాసమాత్రం స్థిత్వా శంభుప్రతిష్ఠాపూర్వకం శివకాంచీతి పట్టణం నిర్మాయ, తత్ ప్రాక్ బ్రహ్మయజ్ఞకుండావిర్భూత విష్ణుం వరదరాజనామానం సమాశ్రిత్య తత్ర విష్ణుకాంచీతి ప్రసిద్ధం పట్టణం నిర్మాయ, తత్ సేవార్థం, బ్రాహ్మణాదీన్ అనేక సేవక భక్త జనాన్ సంపాద్య తానపి శుద్ధాద్వైతవ్రతినః ఎవ కృత్వా సర్వ వేదాంత తాత్పర్యైకనిష్ఠః పరమగురుః సుఖమాస.

గురువంశ కావ్య (శృంగేరి)లోని ఆశ్వాసం 3లోని 35వ శ్లోకంలోని తొలి రెండు వాక్యాలు, శంకరుల వారు జంట నగరాలైన శివకంచి, విష్ణుకంచిని నిర్మింప చేశారని (బహుశ పునర్నిర్మాణం) పేర్కొంటాయి. ఆ వాక్యాలు ఈ విధంగా ఉన్నాయి :

**ఈశాన విష్ణోరభిధానయుగ్మాత్ కాంచీనగర్యౌ సమకారయత్ సః**

కామాక్షి ఆలయాన్ని తాంత్రిక పూజా పద్ధతి నుంచి పరావిద్య, శ్రీవిద్య నిబంధనలతో వైదిక రీతిలో పూజా విధానం జరిగేలా నిర్మింపచేయడంలో శంకరులు కీలక పాత్ర పోషించిన విషయాన్ని మాధవీయ శంకరవిజయం ప్రస్తావిస్తుంది. సంబంధిత (దిగువన పేర్కొన్న) శ్లోకంలో కామాక్షి అనే పేరును ప్రస్తావించనప్పటికీ, శ్లోకంలో గల 'భగవత్య' అన్నపదం స్పష్టంగా కామాక్షీ దేవిని సూచిస్తుంది.

**శ్లో ॥ సురధామ స తత్ర కారయిత్వా పరవిద్యా శరణానుసారి చిత్రం ।**
**అపవార్య చ తాన్త్రికానతానీద్ భగవత్యాః శృతి సమ్మతామ్ సపర్యామ్ ॥**

## శ్రీచక్రం, దేవి కామాక్షి ప్రతిష్ఠాపన :

మాధవీయ శంకరవిజయంలోని శ్లోకం (పైన పేర్కొన్న) భగవతి (కామాక్షి) సురధామం (ఆలయం)లో శంకరులవారు శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించడాన్ని సూచిస్తుంది. పరావిద్య, చరణనుసరి (శ్లోకంలో ఉపయోగించిన పదాలు) శ్రీచక్రంలోని కోణాలను సూచిస్తాయి.

చిద్విలాసుని శంకర విజయంలోని 25వ ఆశ్వాసంలోని పదకొండు శ్లోకాలు 35 నుంచి 45వరకు) కామాక్షి ఎదుట శ్రీచక్రాన్ని చెక్కే పనికి, శ్రీ ఏకామ్రనాథుని, శ్రీ వరదరాజులును, దేవిని సరైన పద్ధతిలో పూజించేందుకు అవసరమైన ఏర్పాట్ల గురించి వివరిస్తాయి.

శంకరాభ్యుదయం 7వ ఆశ్వాసం శంకరులవారు మామిడి చెట్టు కింద గల ఏకామ్రనాథుని దర్శనం చేసుకోవడాన్ని వివరించడమే కాక, కామపాశరాలను అభివర్ణించి, కామాక్షి ఆలయంలోకి ఆయన ప్రవేశం గురించి, కామాక్షిదేవిని పూజించడం గురించి వివరిస్తుంది. గ్రంథంలోని ఎనిమిదివ ఆశ్వాసాన్ని శ్రీచక్రం, కోణాలు, బిందువు తదితరాలకు, అందులో నివసించే శక్తి వివరాలకు అంకితం చేశారు. దీనితో, కంచిలోని ఆలయంలో దేవి కామాక్షి ఎదుట శంకరులవారు శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించిన ప్రస్తావనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

శంకరులవారు కామాక్షీదేవిని ప్రతిష్ఠాపించడాన్ని గురించి గురువంశ కావ్యం చాలా క్లుప్తంగా వివరిస్తోంది:-

**కామాక్ష్యభిఖ్యా రమణీయమూర్తేః దేవ్యాః ప్రతిష్ఠామ్ మునిరాట్ అకార్షీత్**

అనంతానందగిరి రచించిన శంకర విజయంలో అభివర్ణించిన విధంగా చిద్రూపిణి, బ్రహ్మవిద్య, రుద్రశక్తిగా దేవి కామాక్షిని శంకర భగవత్పాదుల వారు ప్రతిష్ఠాపన చేసినట్లుగా తెలుస్తోంది. ఈ రచన బిలంలో (భూగర్భంలోని గుహ) నివసించే దేవి ఛాయా కోణం గురించి కామాక్షి పరదేవత (అత్యున్నత దేవత) అన్న విషయాలను ప్రస్తావిస్తుంది.

తదనంతరం శ్రీ కామాక్షీ ప్రపంచశ్చింత్యతే. సా తు సాంఖ్యాయనస్య మునేరావిర్భూతా కిల ఉపాసనాయాం భగవతీ చిద్రూపిణీ బ్రహ్మవిద్యా రుద్రశక్తి: ఇదానీమపి గుహావాసినీ భూత్వా వర్తతే. తస్యాః పరమేశ్వర్యాః బింబప్రతిష్ఠామ్ అష్టధా కారయామీతి ధియా శ్రీ కామాక్షీ ప్రతిష్ఠామ్ ఆచకార. (Prakarana-64)

శంకరులవారు శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించడం గురించి, చక్రంలో కోణాలు తదితతరాల గురించి 65వ ప్రకరణంలో వర్ణించారు. ఆచార్యులు శ్రీచక్రాన్ని అక్కడ (దేవి ఎదుట) ప్రతిష్ఠించడానికి కారణం, దానిని కేవలం దర్శనం చేసుకోవడం వల్లనే మోక్ష ఫలితాలు (భవబంధాల నుంచి విముక్తి) అందరికీ దక్కుతాయని భావించడమే.

అతః సర్వేషామ్ మోక్షఫలప్రాప్తయే (దర్శనాదేవ శ్రీ చక్రం ప్రభవతీతి) భగవద్భిః ఆచార్యైః తత్ర నిర్మితం.

కామాక్షి దేవి ప్రతిష్ఠాపన గురించి డాక్టర్ షుల్జ్ ప్రచురించిన తుంగభద్ర ప్రాంతంలోని 'భారతి క్రమం'కు సంబంధించిన గురుపరంపర (గురువుల జాబితా)లోను, కుదలిగురుపరంపరనమమలలోనూ పేర్కొనడం జరిగింది.

మణిమంజరిభేదిని (ఆశ్వాసం 4 శ్లోకం 32) కూడా కంచిలో శంకరులు శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించడం గురించి చెప్తుంది.

**శ్లో ॥ తావత్కాలం అభేదవాది గురురాట్ శిష్యైః అనెకైః వృతః ।**
**కాంచీమ్ ప్రాప్య చకార తత్ర విధివత్ శ్రీ చక్రముద్ధారితం ॥**

రాజచూడామణి దీక్షిత 19వ శతాబ్దంలో మధ్యలో రచించిన శంకరాభ్యుదయం కూడా శంకరులవారు కంచిలో శ్రీ కామాక్షిని ప్రతిష్ఠించడాన్ని సూచిస్తుంది:-

**యతీనాం ప్రవరో-ధిగత్య కాంచీపురం అస్మిన్ శుభమాలయం మృదాన్యా విరచయ్య....**

శ్రీరంగంలోని వాణీవిలాస ప్రెస్ ప్రచురించిన మహామహోపాధ్యాయ లక్ష్మణ సూరి రచన భగవత్పదాభ్యుదయ కూడా దేవి కామాక్షి ఎదుట ఆచార్యులు శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించడాన్ని ప్రస్తావిస్తుంది.

శ్రీచక్రం స్థాపయామాస శ్రీ కామాక్ష్యాః రతో గురుః (Conto VIII-79)



# మూకపంచశతి ఆర్యాశతకం

- బాలాత్రిపురసుందరి చిర్రావూరి

శ్లో॥ మధురస్మితేన రమతే మాంసలకుచభారమన్దగమనేన ॥
మధ్యే కాంచి మనో మే మనసిజ సామ్రాజ్యగర్వబీజేన ॥ 17 ॥

**తాత్పర్యం:-** మధురమైన చిరునవ్వు గల, స్థూలములైన కుచములబరువులచేత నెమ్మదియైన నడక గల, మన్మథుని సామ్రాజ్యగర్వమునకు కారణమైన బీజముతో (ఆ కామాక్షి తల్లితో) కాంచీనగరమధ్యమున నా మనస్సు ఆడుకొనుచున్నది.

**బాలమనోజ్ఞ:** ఎప్పుడూ కూడా ఆ తల్లి తన పెదవులయందు, కనులయందు చక్కటి చిరునవ్వును చిందిస్తూ ఉంటుంది. ఆమధురమైన చిరునవ్వును మాటి మాటికీ దర్శించాలనే తలంపు కలిగి మన మనసు ఆవిడ వైపునకే పరుగులిడుతూ ఉంటుంది. ఆ తల్లి మందగమనట. వక్షోజముల బరువుల చేత నెమ్మదిగా నడుస్తూన్నదట. ఇక్కడ ఆతల్లికి, భక్తుడికి ఉన్న సంబంధాన్ని తల్లీబిడ్డలసంబంధంగా అభివర్ణిస్తున్నారు కవి. తల్లి తన బిడ్డకు స్తన్యాన్ని అందించటానికి ఏవిధంగా వస్తుందో తల్లి రాకను ఎదురుచూచే శిశువు యొక్క మనస్సు ఎలా ఉంటుందో తెలుపుతున్నారు. శివునిచే బూడిదయైన మన్మథుడు తిరిగి ఆ తల్లి కనులనుండే పుట్టాడు. ఆవిడ అనుగ్రహంతోనే సామ్రాజ్యాన్ని పొందగలిగాడు. అతని సామ్రాజ్యగర్వానికి కారణం ఎవరంటే ఆ తల్లి కామాక్షే. కాముని తన కనులయందు ఉంచినది కామాక్షి. అటువంటి ఆ తల్లితోనే నా మనస్సు ఆటలాడుచున్నదని భావము.

శ్లో॥ ధరణిమయీం తరుణిమయీం పవనమయీం గగనదహనహోతృమయీమ్ ॥
అంబుమయీం ఇందుమయీం - అంబాం అనుకంపం ఆదిమాం ఈక్షే ॥ 18 ॥

**తాత్పర్యం:-** భూమి-సూర్య-వాయు-ఆకాశ-అగ్ని-యజమాని-జల-చంద్రమూర్తులుగా యున్న మొట్టమొదటిదైన ఆ తల్లిని కంపాతీరమునందు చూచుచున్నాను.

**బాలమనోజ్ఞ:** **"మూలప్రకృతిరవ్యక్తా వ్యక్తా-వ్యక్తస్వరూపిణీ"** అని లలితాసహస్రనామం. మూలప్రకృతి నుండే మహత్తు,మనస్సు, ఆకాశాది పంచభూతాలు, పురుషుడు ఇలా క్రమంగా సృష్టి ఏర్పడింది. మూలకారణం ప్రకృతియే. ఆ ప్రకృతియే ఆ తల్లి. అందుకే ఆదిమతల్లి అన్నారు. పోతనగారు భాగవత ప్రారంభంలో **"ముగురమ్మల మూలపుటమ్మ"** అన్నారు. ఆమె పరబ్రహ్మగా అవ్యక్తంగానూ, వ్యక్తంగా అన్నింటియందు అంతటా వ్యాపించియున్నది. అందుకే అష్టమూర్తులుగా ఆ తల్లి గురించి చెపుతూ వాటికి మూలకారణమైన తల్లి అని అంటున్నారు మహాకవి. **"అష్టమూర్తిః అహిర్బుధ్న్యో మహాకాయో మహానటః..."** అని అమరకోశం. **"యా సృష్టిస్రష్టురాద్యా వహతివిధిహుతం..."** అని ఈశ్వరుని అష్టమూర్తిగా పేర్కొన్నాడు కాళిదాసమహాకవి. శివాశివలకు అభేధం మనకు తెలుస్తుంది.

శ్రీ చంద్రమౌళీశ్వరాయ నమః

## శ్రీ కంచి కామకోటి పీఠం
## జగద్గురు శంకరాచార్య స్వామివారి శ్రీమఠం సంస్థానం
# మహాపాదుకా మండపం, తిరుపతి



శ్రీ కంచి కామకోటి పీఠం వారి మహాపాదుకా మండపం తిరుపతిలోని కపిల తీర్థము మరియు అలిపిరి మధ్య ప్రాంతంలో నిర్మించబడి ఉంది. పూజ్యశ్రీ శంకరాచార్య స్వామివారు అనేక మార్లు వారి విజయయాత్ర సందర్భంగా తిరుపతి చేరుకుని ఈ పాదుకా మండపము నందు శ్రీ మహా త్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వరుని త్రికాల పూజలు నిర్వహించారు.

ఈ మండపము 2021వ సంవత్సరములో భక్తులు నిర్వహించే పూజలు, హోమాలకు అనుగుణంగా, ధర్మకార్యాలకు సౌకర్యవంతంగా పునరుద్ధరించబడింది. ఈ భవనంలో అనేక సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, వేద పారాయణలు, ఉపన్యాసాలు మొదలగు విశేష కార్యక్రమాలు నిత్యం జరుగుతూ ఉంటాయి. భక్తులకు కావలసిన సదుపాయాలు కూడా ఇక్కడ చక్కగా అమలు చెయ్యబడ్డాయి. ధర్మ ప్రచార కార్యక్రమాలలో భాగంగా అనేక ధార్మిక పుస్తకాలను ప్రచురించి భక్తులకు అందించడం జరుగుతూ ఉంటింది. ఈ ప్రాంగణంలో ఇది వరకు భక్తుల కొరకు నిర్వహించబడుతున్న ఉచిత ఆసుపత్రి, పాదుకామండపం ఎదురుగా భవనంలోకి తరలించడమైనది.





## ధర్మకార్యాలకు సౌకర్యాలు

- శ్రీ బాలాత్రిపురసుందరీ సమేత శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి పూజా మండపం
- మహాపాదుకా మండపం
- వేద పాఠశాల
- వేద పారాయణం మరియు హోమాలు, పూజల నిర్వహణ
- అన్నదానం
- భక్తులకు, యాత్రికులకు గదులు,
- యాత్రికులకు లగేజి పెట్టుకోవడానికి తగిన వసతి.

## భక్తులకు విన్నపము:

ఈ క్రింది కార్యక్రమాలు నిరంతరాయంగా జరగడానికి సహృదయంతో సహాయం చేయవలసినదిగా భక్తులకు విన్నపము.

- వేద పారాయణము
- వేద పాఠశాల నిర్వహణకు సహాయం
- అన్నదానం
- సౌకర్యాలను మరింత మెరుగుపరచడానికి
- వైద్యచికిత్సలో పేదలకు రాయితి
- హిందూ ధార్మిక పుస్తకాల ప్రచురణ
- ఉపన్యాసాలు, వేద సభల నిర్వహణ
- ఇతర ధార్మిక కార్యక్రమాలు


Scan for Location Map

Contributions are accepted as cheque/DD in favor of
"KANCHI KAMAKOTI PEETAM A/C SRI Mahapaduka Mandapa"
or by NEFT to SB A/C NO. : 103310011028729
IFSC Code- UBIN0801313
UNION BANK- TTD ADMIN Tirupati BRANCH

83560 60998

kanchimutttpy@gmail.com


# శ్రీ కామకోటివాణి
## ప్రత్యేక సంచిక



వెల - 250 రూపాయలు
(Postage 50 రూపాయలు అదనం)

ప్రత్యేక సంచిక కోసము
సంప్రదించవలసిన వివరాలు:

**శ్రీ కంచి కామకోటి క్యాంపు**
Email ID - srikamakotivaani@gmail.com



## For Sri Kamakoti Vaani Subscription



**Bank Details:**

**Account Name:**
Sri Kamakoti Touryatrika Trust SKV
Bank: ICICI Bank
Account No.: 440705000345
IFSC Code: ICIC0004407
UPI ID – SRIKAMAKOTIVAANI@icici

**Subscription**

₹ 480 INR (India)
₹ 5000 INR
(Lifetime, for 10 years)

e-mail id -
srikamakotivaani@gmail.com

Scan me!

Sri Kamakoti Vaani subscription payment gateway.

Donors may please contact:
**Prayaga Srinivas : 800 800 1335**

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA



## SHRI KANCHI KAMAKOTI PEETAM

### JAGADGURU SHANKARACHARYA SWAMIGAL

### SHRIMATAM SAMSTHANAM

1, SALAI STREET, KANCHIPURAM, TAMILNADU - 631502 INDIA

**www.kamakoti.org**

**fb.me/srikamakoti**

**youtube.com/kanchimath**

**twitter.com/kanchimatham**

**instagram.com/kanchimutt**

Koo

**koo @kamakoti**

**www.kamakoti.tv**

**www.kanchimuttseva.org**

## ESEVA PORTAL

for Online Puja Bookings & Contributions

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA



అజ్ఞానతిమిరాంధస్య జ్ఞానాంజనశలాకయా ।
చక్షురున్మీలితం యేన తస్మై శ్రీగురవే నమః ॥